# అక్కున చేర్చుకోండి.. రుణం తీర్చుకుంటా



జనగామ పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ పట్టణంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- మీ ప్రాంత బిడ్డను ఆదరించి గెలిపించండి
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జనగామ పట్టణంలో ప్రతి గుమ్మం తడుతూ.. బజ్జీలు వేస్తూ కార్యకర్తలను ఉత్తేజ పర్చిన పల్లా
- మంగళ హారతులతో బొట్టుపెట్టి మహిళల దీవెన
- బీఆర్ఎస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం

జనగామ, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : గెలుపే లక్ష్యంగా ఇప్పటికే గ్రామాలను చుట్టేసిన బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రెండురోజులుగా మున్సిపల్ వార్డుల్లో ప్రతి వీధికి వెళ్లి జనంతో మమేకమవుతూ.. ఆప్యాయంగా పలుకరిస్తూ ప్రజల ఆశీర్వాదం తీసుకుంటున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలుగా జనం వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. 'మీ ప్రాంత బిడ్డను నన్ను ఆదరించి అక్కున చేర్చుకొని గెలిపిస్తే రుణం తీర్చుకుంటా' అంటూ పట్టణ వార్డుల్లో ప్రతి గుమ్మం తడుతూ అభ్యర్థిస్తున్నారు. బజ్జీలు వేస్తూ.. ఇస్త్రీ చేస్తూ వినూత్న ప్రచారంతో గులాబీ కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. పల్లాకు కాలనీల్లో మహిళలు తమ ఇండ్ల ముందు స్వాగత ముగ్గులు వేసి మంగళహారతులు పట్టి బొట్టుపెట్టి దీవెనలు అందిస్తున్నారు. జనగామ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తుండడంతో గులాబీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం నెలకొన్నది. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని 2, 3, 4 వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు వాంకుడోతు అనిత, పగిడిపాటి సుధ ఆధ్వర్యంలో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసుల జై కేసీఆర్, జై పల్లా, జయహో బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు. ప్రతి ఇంటికెళ్లి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందిస్తూ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చిన సీఎం కేసీఆర్‌ను దీవించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే జనగామను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

**జనగామను అద్దంలా చేస్తా..**

పెద్దసారుకు దగ్గరగా ఉండే తనను ఎన్నికల్లో గెలిపిస్తే జనగామను అద్దంలా చేస్తానని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే జనగామ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో తలమానికంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. దళిత, మైనార్టీ, రైతాంగ వ్యతిరేక బీజేపీని తెలంగాణ ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ చేతిలోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సురక్షితంగా ఉంటుందని, ఆయనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని అన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జనగామ ఎట్లుండె.. బీఆర్ఎస్ హయాంలో ఎట్లుందో ప్రజలు గమనించాలని కోరారు. నన్ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మీరు ఆశీర్వదిస్తే పెద్దసారు కేసీఆర్‌తో కొట్లాడి మరీ సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో జనగామ, చేర్యాల మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. తెలంగాణలో ముస్లిం, మైనార్టీ విద్యార్థులు చదువుకొనేందుకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు. జనగామ బీఆర్ఎస్ అడ్డా అని 2001లోనే ఇక్కడ ప్రతి మండలంలో గులాబీ జెండా ఎగిరిన గడ్డ అని గుర్తు చేశారు.

## గులాబీ ప్రచార రథాలు సిద్ధం

**ఎన్నికల రథాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : గులాబీ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించేందుకు వీలుగా పార్టీ రథాలు సిద్ధమయ్యాయి. జనగామ నియోజకవర్గంలో ఊరూరా.. వాడవాడలా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం సిద్ధం చేసిన రథాలను బుధవారం అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ నేలతో కలిసి పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ప్రజల్లోకి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో మరోమారు బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జనగామ నియోజకవర్గంలో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార వాహనాన్ని పార్టీ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, వకులాభరణం నర్సయ్య పంతులు, బూరిగె గురువయ్యగౌడ్, నాగమళ్ల శ్రీనివాస్, సర్పంచ్ బుర్ర శ్రీనుగౌడ్, ఎండీ మాజీద్, కుర్రపాటి మధు, సుల్తాన్ గోవింద్‌రెడ్డి, సౌడ మహేశ్, లక్ష్మణ్, ఎండీ ఫయాజ్, మడురి రాజు, పరశురాములు ప్రారంభించారు.

## 'పల్లా'కు విరాళాలు అందజేస్తున్న ప్రజలు

జనగామ, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రచారానికి నియోజకవర్గంలో అపూర్వ స్పందన వస్తోంది. గులాబీపార్టీ గెలుపులో తాము సైతం అంటూ పేద, మధ్యతరగతి ప్రజలు, చిరు ఉద్యోగులు సైతం ముందుకు వస్తున్నారు. కారుకు ఓటేయాలి..పల్లా సారు గెలవాలి..కేసీఆర్ సర్కారు రావాలంటూ ఆకాంక్షిస్తూ అభ్యర్థి ఎన్నికల ఖర్చులో తాము కూడా భాగస్వాములం అవుతామని విరాళాలు ఇచ్చేందుకు పోటీ పడుతున్నారు. మొన్న నర్మెట మండలం మచ్చుపాడ్‌కు చెందిన దివ్యాంగుడు తన పింఛన్ డబ్బులు రూ.4వేలు, బచ్చన్నపేట మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పోచన్నపేటకు చెందిన ఖర్షిద్‌జానీ మహిళ, అదే గ్రామానికి చెందిన వృద్ధుడు రాజిరెడ్డి రూ.100 ఎన్నికల నామినేషన్ ఖర్చుల కోసం పల్లాకు అందజేశారు. బుధవారం జనగామ పట్టణంలోని 4వ వార్డుకు చెందిన జూకంటి యాదగిరి రూ.2వేలు, వనమాల రమేశ్ రూ.5వేలు ఎన్నికల ఖర్చు కోసం అందజేశారు.తనకు ఆర్థికంగా విరాళాలు అందజేస్తున్న ప్రజలకు ఎల్లవేళలా సేవ చేస్తానని, అందుకే రాజకీయాల్లోకి వచ్చానంటూ, మీ అందరి సహకారం మరువలేనని వారికి కృతజ్ఞతలు చెప్పారు.

## పాముకాటుతో రైతు మృతి

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 1 : పాముకాటుతో రైతు మృతి చెందిన ఘటన మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు చెట్కూరి చంద్రయ్య(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగా ఉదయం 10 గంటలకు వ్యవసాయ బావివద్దకు వెళ్లి పనులు చేస్తుండగా చంద్రయ్య కాలుపై పాము కాటేసింది. గమనించిన సమీప రైతులు కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు అతడిని వెంటనే చేర్యాల సర్కారు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ చంద్రయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో ముసలం

- కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తీరుపై గిరిజన నాయకుల అసమ్మతి
- రహస్యంగా సమావేశమైన గిరిజన నాయకులు..?

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 1 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్‌లో ముసలం పుట్టింది. కింది స్థాయి నాయకత్వాన్ని పట్టించుకోవడం లేదని పలువురు కాంగ్రెస్ నాయకులు కినుక వహిస్తున్నారు. ధూళిమిట్ట మండలంలోని ఉమ్మడి కొండాపూర్ గ్రామానికి చెందిన పలువురు గిరిజన నాయకులు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. బుధవారం రహస్య ప్రదేశంలో 30 మందికి పైగా కాంగ్రెస్ గిరిజన నాయకులు సమావేశమైనట్లు సమాచారం. ఈ సమావేశంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తీరుపై సదరు గిరిజన నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఒంటెద్దు పోకడలకు వెళ్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి కొండాపూర్ గ్రామంలో సుమారు 3 వేలకు పైగా గిరిజన ఓట్లు ఉన్నా తమకు పార్టీలో ఎలాంటి ప్రాధాన్యత లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకు సరైన గుర్తింపు ఇవ్వకపోతే మూడు రోజుల్లో తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపినట్లు సమాచారం. కాగా, ఈ విషయం కాస్తా బయటకు పొక్కడంతో కాంగ్రెస్ గ్రామ కమిటీ వేసేందుకు సమావేశమైనట్లు పలువురు నాయకులు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టడం, కవరింగ్ ఇవ్వడం కొసమెరుపు.



రహస్యంగా సమావేశమైన గిరిజన నాయకులు

## తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష

**బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబర్ 1 : తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష అని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే గోస పడతామని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పల్లా గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం పల్లా మాట్లాడుతూ ఓట్ల కోసం తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ యత్నిస్తున్నదని, ప్రజలను 54 ఏండ్లపాటు పాలించి అన్ని విధాలుగా మోసం చేసిన పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలను తెలంగాణలో ఎలా అమలు చేస్తుందో ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని కోరారు. అనంతరం పోతిరెడ్డిపల్లి గ్రామ సమస్యలను పల్లాకు పార్టీ నాయకులు వివరించడంతో అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, సర్పంచ్ కత్తుల కృష్ణవేణిశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడూరు బాలరాజు, నాయకులు మెడబోయిని కనకయ్య, కుమార్, రెహమాన్, వినోద్, రవి, నాయకులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక..**

కొమురవెల్లి, నవంబర్ 1 : మండలంలోని ఐనాపూర్‌కు చెందిన జిల్లా వెంకటనారాయణ, మెరుగు శరత్‌గౌడ్(అడ్వకేట్), నర్సింహులు, సూరగోని కిషన్‌గౌడ్, వగలబోయిన రవి బుధవారం జనగామ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి పల్లా గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మెరుగు కృష్ణాగౌడ్, మాజీ సర్పంచ్ మెరుగు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బూర్గు స్వామిగౌడ్, మెరుగు నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ కమిటీ సభ్యులదే కీలకపాత్ర

చేర్యాల, నవంబర్ 1 : ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యులదే కీలకపాత్ర ఉంటుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం, ఎంపీపీ కరుణాకర్, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్ అన్నారు. బుధవారం చేర్యాలలో వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యుల నియామక ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న బూత్‌ల వారీగా ఇన్‌చార్జిలను నియమించి రోజూ విస్తృతంగా ప్రచారం చేయించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులతో బూత్ కమిటీ సభ్యులు ఐక్యంగా ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.



బూత్ కమిటీ సభ్యులతో బీఆర్ఎస్ నాయకులు


**తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్**

**ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్, సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా ప్రింటింగ్ ప్రెస్ వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా ఖరీఫ్ 2023-24గాను సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా నిర్వహించబడే వారి ధాన్యం కొనుగోళ్లకు అవసరమగు రిజిస్టర్లు మరియు బైండింగ్ బుక్కులపై ప్రింటింగ్ చేయుటకు టెండర్లు పిలువనైనది కావున ఇది గమనించి ఆసక్తిగల వారు సిద్దిపేట జిల్లా పౌరసరఫరా సంస్థ కార్యాలయంను సంప్రదించగలరు.

**టెండర్ వివరాలు**

| Sale of Tender Form | Filling | Opening of Tenders |
|---|---|---|
| తేది: 02-11-2023 ఉ. 10.30గం.ల నుండి తేది: 04-11-2023 మ. 2.00గం.ల వరకు జిల్లా మేనేజర్ తె.రా.పౌర సరఫరాల సంస్థ, సిద్దిపేట నందు | తేది: 04-11-2023 మ. 2.00గం.ల నుండి తేది: 04-11-2023 మ. 3.00గం.ల వరకు జిల్లా మేనేజర్ తె.రా.పౌర సరఫరాల సంస్థ, సిద్దిపేట నందు | తేది: 06-11-2023 ఉ. 10.30గం.ల వరకు అదనపు కలెక్టరు కార్యాలయము సిద్దిపేట నందు |

ఇట్టి టెండర్ ఫారం కొరకు రూ. 5,000/-లను District Manager TSCSCLtd, సిద్దిపేట జిల్లాపేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ (DD) రూపంలో చెల్లించి, జిల్లా మేనేజర్ తె.రా.పౌర సరఫరాల సంస్థ, సిద్దిపేట వారి కార్యాలయం నందు టెండర్ ఫారం తీసుకోగలరు. సంప్రదించవలసిన వివరాలు No. 9581858682.

**Sd/- అదనపు కలెక్టరు మరియు**
**పదవి రీత్యా కార్యనిర్వహణాధికారి, తె.రా.పౌర సరఫరాల సంస్థ, సిద్దిపేట**